



19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక **సూర్య**

www.suryaa.com

**ఎన్టీఆర్ కృష్ణా**

శుక్రవారం 23 జనవరి 2026 పేజీలు 8


### సెంట్రల్ జోన్ పరిధిలో..

# ఆ పోలీసులు చెప్పిందే శాసనమా?



- సీఐలకు తెలియకుండా కొన్ని.. ఎస్ఐలకు తెలియకుండా మరికొన్ని..
- బాధితులకు చుక్కలు చూపెడుతూ పెత్తందారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ..
- బార్ల నుంచి టిఫిన్ బండ్ల వరకూ అందినకాడ వసూళ్లు ?
- రైటర్లు, సీఐల అసిస్టెంట్లపై వెల్లువెత్తుతున్న అవినీతి ఆరోపణలు
- ఇంతకీ ఏసీపీ సారూ జర మీ స్టేషన్లపై దృష్టిపెట్టరూ !

ఫ్రెండ్లీ పోలీసింగ్.. ఏ పోలీస్ స్టేషన్‌కైనా వెళ్ళండి మీ ఫిర్యాదు నుంచి పరిష్కారం వరకు అంతా న్యాయంగా జరిగిపోతుందనేది మన పోలీస్ బాస్‌లు పదే పదే చెప్పే మాట. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం జరుగుతున్న తంతు వేరే.. ఎవరైనా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేయాలంటే కంప్లైంట్ రాసి రైటర్ వద్దకు వెళ్ళి అక్కడి నుంచి సీఐ వరకు వెళ్ళాలంటే ముందుగా సీఐల అసిస్టెంట్లు చూడాలి.. వీళ్ళు ఎవరి పేరు చెబితే వారికే అనుకూలంగా స్టేషన్లలో పంచాయితీలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బార్‌ల నుంచి టిఫిన్ బండి వరకూ వసూళ్ళు చేస్తున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. ఇంతకీ విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సెంట్రల్ జోన్ పోలీస్ స్టేషన్‌లలో జరుగుతున్న వ్యవహారంపై నేటి దినపత్రిక సూర్య ప్రత్యేక కథనం.

**విజయవాడ క్రైం మేజర్ న్యూస్ :** చిన్న కేసు పెద్ద కేసు అనేది ఏమీ లేదు ఏదైనా మా కనుసన్నల్లో నడవాల్సిందే... మేమే దాన్ని పరిష్కరించాల్సిందే..అంటే పోలీస్ బాషలో చెప్పాలంటే కేసు కట్టాలన్నా మేమే కేసు రాజీ చేయాలన్నా మేమే అదేంటి మిగతా 2లో...

### వైద్య విద్య పరీక్షల తీరుపై

# మరింత నిఘా



**రిమోట్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్**

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** వైద్య విద్య పరీక్షల్లో పారదర్శకతను పెంచే చర్యల్లో భాగంగా ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో 'రిమోట్ కమాండ్ కంట్రోల్'ను ఏర్పాటుచేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్రంలోని 37 ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో జరిగే యూజీ, పీజీ మెడికల్ వార్షిక/సప్లిమెంటరీ పరీక్షల తీరును మిగతా 7లో...




### తిరువూరులో...

# వీఆర్‌ఏలతో వెట్టి చాకిరీ

పాలనా వ్యవస్థలో మానవత్వానికి మచ్చ...

వీఆర్‌ఏలు మనుషులే కదా...?

వివరాలు 2 లో

## పటిష్ట ప్రణాళికతో ఉద్యోగుల సమస్యల పరిష్కారం

దశల వారీగా బకాయిల చెల్లింపునకు కృషిచేస్తున్నాం

ఎన్‌జీజీవో నేతలతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



**విజయవాడ, జనవరి 22, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల 2

### మత్స్యకారుల జీవనోపాధికి

## ముమ్మరంగా చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో గ్రీన్ క్లైమేట్ ఫండ్‌తో మత్స్య సంపద పెంపుదలకు మత్స్యకారుల జీవనోపాధికి ముమ్మరంగా 2

(మొదటిపేజీ తరువాయి)



## మత్స్యకారుల జీవనోపాధికి ముమ్మరంగా చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ



చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో గ్రీన్ క్లైమేట్ ఫండ్ వినియోగంపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా సముద్రతీరం ఉన్నందున మత్స్య సంపద పెంపుదలకు తద్వారా మత్స్యకారుల జీవనోపాధికి ఎంతగానో అవకాశాలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రీన్ క్లైమేట్ ఫండ్ ద్వారా మత్స్యకారుల జీవనోపాదుల పెంపుదలకు 100 శాతం రాయితీతో నిధులు ఇచ్చి తోడ్పడుతోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 12 యూనిట్ల అలంకార చేపలు ఒక్కొక్కటి 45,948 రూపాయల చొప్పున కోడూరు, నాగాయలంక మండలాల్లో త్వరలో నెలకొల్పుటకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 27 యూనిట్ల పీతల పెంపకం యూనిట్లను ఒక్కొక్కటి 19,404 రూపాయల చొప్పున ఇప్పటికే నెలకొల్పడం జరిగిందన్నారు. అంతేకాకుండా వచ్చే 2026-27 ఆర్థిక సంవత్సరంలో అలంకార చేపలకు సంబంధించి మరో 100 యూనిట్లు నెలకొల్పుటకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరంలో పీతల పెంపకం సంబంధించి మరో 500 యూనిట్లు నెలకొల్పుటకు, సముద్ర నాచు పెంపకానికి సంబంధించి 100 యూనిట్లు నెలకొల్పాలన్నది లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు.ఇందుకు తగ్గట్టుగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సంబంధిత లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలన్నారు. సముద్ర నాచు పెంపకానికి సంబంధించి ఈ సంవత్సరం తొలి దశలో 5 యూనిట్లు ఒక్కొక్కటి 11663 రూపాయల చొప్పున నెలకొల్పి ప్రయోగాత్మకంగా పరిశీలన జరిపి ఆ తరువాత మిగిలిన యూనిట్లు కూడా నెలకొల్పాల్సి ఉందన్నారు. రానున్న రోజుల్లో అలంకార చేపలు, పీతలు, సముద్ర నాచు పెంపకంపై మత్స్యకారులకు శిక్షణ ఇవ్వాలని, ప్రదర్శనశాల ఏర్పాటు చేసి మత్స్య సంపద డీలర్లను కూడా పిలవాలన్నారు.ఈ సమావేశంలో మత్స్యశాఖ జేడీ అయ్యా నాగరాజ, డిఆర్డిఏ పి డి హరిహరనాథ్, డీఎఫ్ఓ సునీత గ్రీన్ క్లైమేట్ ఫండ్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ ఉషా, జిల్లా సమన్వయకర్త బి ప్రభాకర్ పాల్గొన్నారు.

# సెంట్రల్ జోన్ పరిధిలో ఆ పోలీసులు చెప్పిందే శాసనమా?

(మొదటిపేజీ తరువాయి)

అనుకుంటున్నారా అవును మీరు చదువువుతుంది నిజమే... వ్యక్తి మోసం చేశాడనో, వ్యక్తి చోరీ చేశాడనో ఏ కేసైనా మొదటగా వీళ్ల దృష్టిలో పెట్టాల్సిందే. పలానా పోలీస్ స్టేషన్ పరిధిలో బార్ పెట్టినా టిఫిన్ బండి పెట్టి అర్ధరాత్రి వరకూ నడిపినా ముందుగా వీళ్ళను ప్రసన్నం చేసుకోవాల్సిందేనట. స్టేషన్ లో సీఐ ఉన్నా ఎస్ ఐ లు ఉన్నా వీళ్లను ప్రసన్నం చేసుకుంటే మన జోలికి ఎవరూ రారనే ధీమా ప్రతిఒక్కరిలో వచ్చేసిందట. సెంట్రల్ జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లలో జరుగుతున్న తంతుపై రకరకాల పుకార్లు వినిపిస్తున్నాయి.

సాధారణంగా సీఐలకో, ఎస్ ఐ లకన్నా సెంట్రల్ జోన్ పరిధిలోని ప్రతి పోలీస్ స్టేషన్లలో సీఐ ల అసిస్టెంట్లుకు, స్టేషన్ల రైటర్లదే పెత్తనమంతా నడుస్తుందనే ప్రచారం జరుగుతుంది. స్టేషన్ లో ఏ కేసు పని నిమిత్తం వెళ్ళిన మొదట వెళ్ళిన వ్యక్తిదే పైచేయి అన్నట్లుగా నడుస్తుందన్న పుకార్లు వినిపిస్తున్నాయి. తాజాగా సెంట్రల్ జోన్ పోలీస్ స్టేషన్లలో సీఐ లు మారినా, ఎస్ ఐలు మారినా వీరు అలానే ఉంటూ వచ్చిన వారిని మచ్చిక చేసుకుంటూ సీఐల అసిస్టెంట్లు, రైటర్లు మాత్రం వారి కనుసన్నల్లోనే అంతా నడిపిస్తున్నారన్న ప్రచారం జరుగుతుంది. సీఐల అసెస్టెంట్లు రైటర్లు కొన్ని కేసుల్లో కుమ్మక్కు అవుతున్నారన్న ప్రచారం జరుగుతుంది. అసలు పోలీస్ స్టేషన్లలో సీఐ బాస్. ఆ తర్వాత ఎస్ ఐ లది కొంతమేర వ్యవహారం ఉంటుంది. కాని ఈ మధ్యన సీఐల అసిస్టెంట్లు, రైటర్లు చెప్పిందే శాసనమవుతుందంటూ వినికిడి వినిపిస్తుంది. పక్క స్టేషన్లలో వ్యవహారాల్లోనూ దూరి ఏ ప్రజా ప్రతినిధితో చెబితే పని జరుగుతుందో వీళ్ళే చెప్పి సెటిల్ మెంట్లు చేపిస్తున్నారన్న ప్రచారం జరుగుతుంది. ఇటీవల కాలంలో వీరి పెత్తనంపై కొంతమంది సీఐ లు కఠినంగా వ్యవహరించినా చాలామంది సీఐలకు తెలియకుండా వీరంతా ఇల్లీగల్‌గా సెటిల్ మెంట్లు చేస్తున్నారన్న విమర్శలు వినిసిస్తున్నాయి.

అయితే సెంట్రల్ జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో అత్యధికంగా బార్లు 24 గంటలు నడిపినా, రేషన్ మాఫియా అనధికారికంగా పేదల బియ్యాన్ని బొక్కేసినా ఇతరత్రా వ్యవహారాల్లో నూ వీరి నుంచి సీఐలకు ప్రతి నెలా ముడుపులు వెళుతుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల సిటీ పరిధిలో ఓ స్టేషన్ లో జరిగిన ఓ వ్యవహారంలో సీఐ ను విఆర్ కి పంపి సీఐ అసిస్టెంట్ ను విధుల నుంచి తొలగించిన ఘటన మరువకముందే మరళా వీరి ఆగడాలు శృతి మించుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.. చూడాలి ఇకనైనా ఏసీపీ వారి స్టేషన్ల పరిధిలో జరుగుతున్న అక్రమాలపై ఓ కన్నేసి ఉంచుతారో లేదో చూడాలి మరి.

**బెజవాడ పోలీస్ స్టేషన్ల పరిధిలోని జరుగుతున్న సీఐల అసిస్టెంట్లు, రైటర్ల అవినీతి అక్రమాలపై మరిన్ని కథనాలు నేటి దినపత్రిక సూర్యలో తరువాయి సంచికలో..**

# తిరువూరు వీఆర్ఏలతో వెట్టి చాకిరీ...

## పాలనా వ్యవస్థలో మానవత్వానికి మచ్చ... - వీఆర్ఏలు మనుషులే కదా...?

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** వీఆర్ఏలు మనిషులే కదా...? ఈ ప్రశ్నే నేడు ప్రజాసమాజంలో చర్చకు దారితీస్తోంది. గ్రామ పరిపాలనకు పునాది అయిన వీఆర్ఏ లు ప్రభుత్వ ఉద్యోగులే, కానీ.... వెలుగులోకి వచ్చిన ఘటనలు చూస్తే, వారిని ఉద్యోగులుగా కాకుండా తహసీల్దార్ కింద పనిచేసే కూలీలుగా చూస్తున్న దురభిప్రాయం స్పష్టంగా కనిపిస్తోంది. వీఆర్ఏలతో వెట్టి చాకిరి చేయించడం, అధికారుల వ్యక్తిగత పనులకు వినియోగించడం, ముఖ్యంగా తహసీల్దార్ కారు కడిగించడం వంటి ఘటనలు బయటకు రావడం పరిపాలనా వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఇది కేవలం ఒక వ్యక్తి చేసిన తప్పుగా కాకుండా, వ్యవస్థలోని అధికార అసమతుల్యతను ప్రతిబింబించే సంఘటనగా చూడాలి.



**కింది స్థాయి ఉద్యోగులంటే ఇంత చులకనా...?**

ప్రభుత్వ వ్యవస్థలో “కింది స్థాయి” అన్న పదం హోదాను సూచించాలి తప్ప, గౌరవాన్ని కాదు.. కానీ వాస్తవంలో, కింది స్థాయి ఉద్యోగుల పై అవమానం, నిర్లక్ష్యం, అణచివేత కొనసాగుతూనే ఉంది. “వీళ్ళు ఉద్యోగులా...? లేక అధికారుల కింద పని చేసే కూలీలా...? ”అన్న భావన అధికారుల ప్రవర్తనలో స్పష్టంగా కనిపిస్తోంది,

**తోటి ఉద్యోగుల మధ్య ఇదేం పని..?**

తిరువూరులో ఒకే శాఖలో, ఒకే ప్రభుత్వానికి పని చేసే ఉద్యోగుల మధ్య ఇలా యజమానికూలీ సంబంధం ఏర్పడడం దురదృష్టకరం, అధికార బాధ్యతల పేరుతో వ్యక్తిగత పనులు చేయించుకోవడం చట్టపరంగా తప్పు మాత్రమే కాదు, నైతికంగా కూడా ఘోరం, ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం ఇలాంటి ఘటనలు ఇప్పుడే మొదటిసారి జరుగుతున్నవా..? లేక ఇప్పటివరకు భయంతో, ఉపాధి పోతుందన్న ఆందోళనతో వీఆర్ఏ లు మౌనంగా భరించారా..? వాస్తవానికి, ఇవి ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న మౌన దోపిడీకి సంకేతాలు. ఇప్పుడు తిరువూరు లో వెలుగులోకి రావడం ప్రజాస్వామ్యంలో మీడియా, సోషల్ చర్చల ప్రభావాన్ని చూపిస్తోంది.

**ఇది మానవత్వమేనా...?**

ప్రభుత్వ ఉద్యోగిగా పని చేయడం అంటే సేవ చేయడమే కానీ, అవమానాన్ని భరించడమేమీ కాదు. వీఆర్ఏలు కూడా కుటుంబాలు కలిగిన వ్యక్తులు, సమాజంలో గౌరవంతో జీవించాలనుకునే పౌరులు. వారి శ్రమను, హోదాను, గౌరవాన్ని తొక్కేయడం మానవత్వానికి విరుద్ధం,

**ప్రజాసమాజం ఎందుకు స్పందించాలి?**

తిరువూరులో ఈ రోజు వీఆర్ఏలపై జరుగుతున్న అవమానం, రేపు మరే కింది స్థాయి ఉద్యోగులపై అయినా జరగవచ్చు, అందుకే ఇది ఒక్క వర్గం సమస్య కాదు మొత్తం పరిపాలనా వ్యవస్థకు సంబంధించిన ప్రశ్న, వీఆర్ఏలతో జరిగిన ఈ అవమానకర ఘటనలు ఒక స్పష్టమైన సందేశం ఇస్తున్నాయి, అధికారం సేవ కోసం, దోపిడీ కోసం కాదు.ప్రభుత్వ ఉద్యోగుల మధ్య గౌరవం, సమానత్వం లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమే ఉండదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ఆలోచించాలి,కింది స్థాయి ఉద్యోగులంటే చులకనా...? లేక పరిపాలనకు మూలస్తంభాలా...? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# పటిష్ట ప్రణాళికతో ఉద్యోగుల సమస్యల పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)


పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోందని.. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు కృషిచేస్తున్నామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఇటీవల ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగులు, పెన్షనర్లకు సంక్రాంతి పండగ సందర్భంగా డీఏ బకాయిల మంజూరు చేసిన నేపథ్యంలో ఏపీ జేఏసీ ఛైర్మన్, ఎన్‌జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ ఆధ్వర్యంలో పలువురు ఎన్‌జీజీవో నాయకులు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఉద్యోగుల బకాయిలు చెల్లింపు, కరువు భత్యం విడుదల, మహిళా ఉద్యోగులకు సంబంధించిన చైల్డ్కేర్లు పై వయోపరిమితే ఎత్తివేయడం వంటి విషయాలలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని ఇందుకు ఉద్యోగుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఉద్యోగుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని వేతన సవరణ సంఘం ఏర్పాటు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వంటి అంశాలపై మరింత ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. గతంలో పెన్షనర్లకు 2018 లో ఇప్పటి ప్రభుత్వమే అడిషనల్ క్వాంటంను మంజూరు చేయగా, గత ప్రభుత్వం అందులో కోత విధించడం



జరిగిందన్నారు. దాన్ని పునరుద్ధరించవలసిన అవసరం ఉందని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని అడిషనల్ క్వాంటం విధానంలో విధించిన కోతను తిరిగి పునరుద్ధరించి పెన్షనర్లను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల పాఠశాలల ఉద్యోగులకు పదవీ విరమణ వయోపరిమితిను 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచే విషయమై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ త్వరలో నిర్ణయం తీసుకునేలా చూడాలని కోరారు. మేము 57 ప్రకారం 2004 ముందు నోటిఫికేషన్ ద్వారా నియమకం పొందిన 11 వేల మంది ఉద్యోగులను ఓపీఎస్ లోకి తీసుకురావాలని కోరారు. ఉద్యోగ సంఘ నేతలు తన దృష్టికి తీసుకొచ్చిన అంశాలపై ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం చర్చించడం జరిగిందని.. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగుల స్నేహపూర్వక ప్రభుత్వమని, ప్రభుత్వం, ఉద్యోగులు వేర్వేరు కాదని పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలనే కృతనిశ్చయంతో గౌరవ ముఖ్యమంత్రి ఉన్నారని, ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ ముందుకెళ్తున్నామని ఈ నేపథ్యంలోనే సంక్రాంతికి కూడా ఉద్యోగులను పెన్షనర్లు దృష్టిలో పెట్టుకుని రూ. 1100 కోట్లు విడుదల చేశామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక ఇబ్బందుల వల్ల, గత ప్రభుత్వంలో కొండలా బకాయిలు పేరుకుపోవడం వల్ల ఓ ప్రణాళిక ప్రకారం, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ కూడా, చెల్లింపు ప్రక్రియ చేపడుతున్నామని ఉద్యోగులు సహకరించాలని కోరారు. ఉద్యోగ సంఘాలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్, గౌరవ ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కారం దిశగా కృషి చేస్తానని, ఉద్యోగుల శ్రేయస్సు కోసం ఈ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర ఎన్జీజీవో సంఘ ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, కోశాధికారి భారతి ప్రసాద్, మహిళా ప్రతినిధి రాజ్యలక్ష్మి, ఖజానా శాఖ రాష్ట్ర అధ్యక్షుడు పాము శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, క్యాపిటల్ సిటీ నాయకులు శ్రీధర్, రామకృష్ణ ఉద్యోగులు పాల్గొన్నారు.

# 31న సీఎంచే వర్చువల్‌గా ప్రారంభించే ఏర్పాట్లను వెంటనే చేయాలి

## కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో వాయు కాలుష్యం ధ్వని కాలుష్యం నివారణకు పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ సైకిళ్లు ఎంతగానో తోడ్పడతాయని, ఈనెల 31న రాష్ట్ర ముఖ్యమంత్రిచే వర్చువల్ గా ప్రారంభించే ఏర్పాట్లను వెంటనే చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ప్రకృతిలో రాను రాను వాయు కాలుష్యం, ధ్వని కాలుష్యము అధికమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పర్యావరణం కలుషితమై మానవుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. దీన్ని నివారించడం కోసం ప్రతి శనివారం కలెక్టరేట్లోపలికి సైకిళ్లపైన గాని లేదా కాలినడకన గా ని రావాలని జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులకు సూచించడం జరిగింద న్నారు. ఈనెల 31వ తేదీన కుప్పంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎలక్ట్రిక్ సైకిల్ పంపిణీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున లాంచనంగా ప్రారంభిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో కూడా తొలి దశలో 500 ఎలక్ట్రిక్ సైకిల్ ల పంపిణీకి ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించే ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలన్నారు. ఇందుకోసం ఈనెల 27వ తేదీ నాటికి ఎలక్ట్రిక్ సైకిల్లు జిల్లాకు చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కో ఎలక్ట్రిక్ సైకిల్ విలువ 23,999 రూపాయలు అవుతుందని, 24 నెలల పాటు ఈఎంఐ ద్వారా కూడా చెల్లించవచ్చని, అవసరమైనప్పుడు బ్యాటరీ చార్జి చేసుకోవచ్చని, ఈ సైకిల్ తొక్కడం ఎంతో సులభమని, ఈ సైకిల్ వాడటం వలన ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షించిన వారమవుతామన్నారు. జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ - సైకిల్ కొనుగోలుకు ముందుకు రావాలన్నారు. మండలాల వారీగా ఎలక్ట్రిక్ సైకిళ్లు కొనుగోలు చేయనున్న వారి జాబితాను సిద్ధం చేసి ఈ- సైకిళ్ళ సరఫరా చేసే ఈ మోటోరాడ్ కంపెనీకి అందజేయాలన్నారు. రెండు డెమో సైకిల్లను కూడా జిల్లా కేంద్రంలో వెంటనే అందుబాటులో ఉంచాలని కలెక్టర్ కంపెనీ నిర్వాహకులకు సూచించారు. అంతేకాకుండా ఎలక్ట్రిక్ సైకిళ్ళ విడిభాగాలను కలుపుట, వాడకంపై కొంతమంది యువతీ యువకులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఇందుకోసం ఉత్సాహం ఉన్న యువతను ఎంపిక చేయాలని కలెక్టర్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి నరేష్కు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ చంద్రశేఖర్ చంద్రశేఖర రావు రావు డి ఆర్ డి ఎ పి డి హరిహరనాథ్ ఈ మోటోరాడ్,పూణే కంపెనీ వ్యవస్థాపకులు కపిల్ మాండలిక్, దక్షిణ ప్రాంత ప్రతినిధి దర్శన్ పాల్గొన్నారు.

## బ్లెండర్స్ ప్రైడ్ ముజ్జి జెనిత్ బ్లాక్ ఎడిషన్





**గుంటూరు మేజర్ న్యూస్ :** భారతదేశపు ప్రీమియం విస్కీ విభాగంలో నాయకునిగా ఉన్న బ్లెండర్స్ ప్రైడ్, బ్లెండర్స్ ప్రైడ్ జెనిత్ బ్లాక్ ఎడిషన్ విడుదలను ప్రకటించింది. ఒక నిజమైన, విలక్షణమైన అనుభవాన్ని సృష్టించడానికి ఆకర్షణీయమైన నలుపు రంగు అందాన్ని దిగ్గజపు బ్లెండర్స్ ప్రైడ్ బ్లెండ్ తో కలిపిన లిమిడెట్ ఎడిషన్ ఇది. మెరుగైన విలాసం, విలక్షణతకు ప్రాధాన్యతనిచ్చే ఆకర్షణీయమైన నలుపు రంగు డిజైన్ లో ఉంచిన జెనిత్ బ్లాక్ ఎడిషన్ అర్హత కలిగిన విస్కీ విజ్ఞుల కోసం సూక్ష్మంగా రూపొందించబడిందని పెర్నాడ్ రికార్డ్ ఇండియా సీఎంవో దేబాశ్రీ దాస్ గుప్తా పేర్కొన్నారు. పాన్-ఇండియా విడుదల కోసం ప్రణాళిక చేయబడిన, బ్లెండర్స్ ప్రైడ్ జెనిత్ బ్లాక్ ఎడిషన్ ప్రస్తుతం ప్రత్యేకమైన స్టోర్స్ లో మాత్రమే లభిస్తోంది.


## సిమెంట్ రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించిన జడ్పీటీసీ



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని తాడంకిలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను జడ్పిటిసి సభ్యురాలు ఏనుగ వెంకట రమణకుమారి గురువారం ప్రారంభించారు. జిల్లా పరిషత్ నిధులు 10 లక్షల రూపాయలతో జాతీయ రహదారి నుండి పాత పంచాయతీ వరకు చేపట్టిన ఈ రహదారి అభివృద్ధి పనులకు ఆమె భూమి పూజ నిర్వహించారు. గ్రామాలలో అంతర్గత రహదార్ల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, వైఎస్ఆర్ ప్రసాద్, కోనేరు నాని, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా వినియోగదారుల ఫోరమ్‌లో

## ఫైనాన్స్ కంపెనీపై రైతు విజయం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వ్యవసాయ నిమిత్తం ట్రాక్టర్ కోసం తీసుకున్న రుణం తిరిగి చెల్లించిన ఇబ్బందులు పెడుతున్న ఫైనాన్స్ కంపెనీకి జిల్లా వినియోగదారుల కమిషన్‌లో చుక్క ఎదురయింది. గుడ్లవల్లేరు మండలం విన్నకోట గ్రామానికి చెందిన రైతు కోటప్రోలు ఆదినారాయణ ట్రాక్టర్ కొనుగోలు నిమిత్తం గుడివాడ లో చోడమండలం ఇన్వెస్ట్మెంట్, ఫైనాన్స్ కంపెనీ వద్ద ఫైనాన్స్ తీసుకున్నాడు. ఫైనాన్స్ కంపెనీ వారు ముందుగానే ఇన్స్టాల్మెంట్ నిమిత్తం చెక్కులు తీసుకున్నారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మారిటోరియం సందర్భంగా ఒక నెల ఇన్స్టాల్మెంట్‌ను ఫైనాన్స్ కంపెనీ చివరి నెలలో వసూలు చేసింది. రుణ మొత్తం చెల్లించిన "నో అబ్జెక్షన్ లెటర్" ఇమ్మని వినియోగదారుడు వెళితే ఫైనాన్స్ కంపెనీ వారు సుమారు 40,000 అదనపు వడ్డీ చెల్లించాలని ఇబ్బంది పెట్టారు..నష్టపోయిన వినియోగదారుడు మచిలీపట్నం కు చెందిన సీనియర్ న్యాయవాదులు లంకిశెట్టి బాలాజీ, మద్దాల సువర్ణ రాజుల ద్వారా కృష్ణాజిల్లా వినియోగదారుల కమిషన్ లో ఫిర్యాదు దాఖలు చేశారు. ఉభయ పక్షాలు వాదనలు విన్న పిదప ఫైనాన్స్ కంపెనీ వాదన తోచిపుచ్చుతూ వినియోదారుడు మొత్తం తిరిగి రుణం చెల్లించాడు కాబట్టి 30 రోజుల లోపు వినియోగదానికి "నో అబ్జెక్షన్ సర్టిఫికెట్" ఇవ్వాలని వినియోగదారుడు కి మానసిక ఆవేదన కలగజేసినందుకు 25వేల రూపాయలు నష్టపరిహారం, కోర్టు ఖర్చులు కింద పదివేల రూపాయలు వెరసి 35 వేల రూపాయలు 30 రోజుల్లోపు చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు చింతలపూడి కిషోర్ కుమార్, మహిళా సభ్యురాలు రాయల శ్రీలక్ష్మి గురువారం తీర్పు చెప్పారు. ఏ విధమైన ఖర్చు లేకుండా సత్వర న్యాయం పొందినందుకు వినియోగదా రుడైన రైతు హర్షం వ్యక్తం చేశారు. గుడివాడలో అనేక ఫైనాన్స్ కంపెనీలు వినియోగదారులు మోసం చేసి అధిక వడ్డీ వసూలు చేస్తున్నాయని వారికి ఈ విధమైన తీర్పు చెంపపెట్టు వంటిదని వినియోగదారుడు ఆదినారాయణ హర్షం వ్యక్తం చేశారు.

## సిపిఐ యోధునికి ఘన నివాళులు



**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని పెదముత్తేవి గ్రామ సిపిఐ శాఖా కార్యదర్శిగా ఎనలేని సేవలు అందించి కడవరకు ఎర్రజెండా నీడనే నమ్ముకున్న నర్రా బాబురావు ఆశయ సాధనకు యువత పాటుపడాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పెదముత్తేవి గ్రామంలో ఈనెల 8వ తారీఖున మృతి చెందిన సీనియర్ కామ్రేడ్ సిపిఐ నాయకులు నర్రా బాబురావు (92) సంస్మరణ సభ గురువారం ఆయన స్వగృహం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కులాలకు రాజకీయాలకు అతీతంగా అధిక సంఖ్యలో దూర ప్రాంతాల నుంచి పలు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి లాల్ సలాం చేశారు ఈ సందర్భంగా పార్టీలోఆయన చేసిన సేవలను పలువురు మననం చేసుకొన్నారు. అప్పట్లో జరిగిన భూ పోరాటాలలో దివిసీమ ప్రాంతంలో పలువురు నాయకులతో పాల్గొన్న సంఘటనలోని ప్రస్తావించారు. కృష్ణాజిల్లా సిపిఐ సమితి సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నేషనల్ సెంట్రల్ కమిటీ సభ్యులు అక్కినేని వనజ,ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్, రైతు సంఘం జిల్లా నాయకులుహనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆర్ పిచ్చయ్య, రైతు సంఘం నాయకులు వెలగపూడి అజాద్, కృష్ణాజిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు కోదాటి నారాయణరావు, సిపిఐ పామర్రునియోజకవర్గ సమితి కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్. రామలింగేశ్వరరావు, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులుటి. పూర్ణచంద్రరావు, పామర్రు నియోజకవర్గ కమిటీ సభ్యులు కాకర్ల చంద్రశేఖర్, తదితరులు పాల్గొనే నివాళులర్పించారు.

## ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ నుంచి 2026 బీఈఈ స్టార్ రేటెడ్ ఎయిర్ కండిషనర్లు

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఎలక్ట్రానిక్స్‌లో అత్యంత విశ్వసనీయమైన బ్రాండ్ ఎల్జీ ఎలక్ట్రానిక్స్, ఇండియా లిమిటెడ్, కొత్త 2026 బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ స్టార్ రేటింగ్ ప్రమాణాలను పూర్తిగా పాటించే ఎయిర్ కండీషనర్ల సమగ్రశ్రేణిని ప్రవేశపెట్టిన తొలి బ్రాండ్లలో ఒకటిగా తన ఆవిర్భావాన్ని ప్రకటించింది. దీంతో అత్యంత అధునాతనమైన, విద్యుత్తును ఆదా చేయగల కూలింగ్ టెక్నాలజీ భారతదేశంలోని వినియోగదారులకు తక్షణం లభిస్తుంది. అప్‌హోడేట్ చేసిన ఈ బీఈఈ నిబంధనలు విద్యుత్తు ప్రమాణాల్లో గణనీయమైన ముందడుగును సూచిస్తాయి. అంతర్జాతీయ విద్యుత్తు పెర్ఫార్మెన్స్ ప్రమాణాలతో భారతదేశాన్ని అనుగుణంగా చేసేందుకు యావత్తు పరిశ్రమ కోసం ప్రమాణాన్ని పెంచుతాయి. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ కో-ఛీఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ సంజయ్ ఛిత్కారా మాట్లాడుతూ, కొత్త బీఈఈ ప్రమాణాలకు అనుగుణంగా ఉండటంతో, విశ్వసనీయమైన, విద్యుత్తును ఆదా చేయగలిగిన ఎయిర్ కండిషనింగ్ సొల్యూషన్లను ఆఫర్ చేసేందుకు కొత్త సీజన్ లోకి అడుగుపెడుతున్నట్లు తెలిపారు. ఇది వినియోగదారులకు సొమ్మును ఆదా చేసుకునే అవకాశంతో పాటుగా, అత్యుత్తమ కూలింగును కూడా పొందే అవకాశాన్ని కూడా కలిగిస్తుందని అన్నారు.

## చేనేత నేత కార్మికులను అమెజాన్ ఇండియా ద్వారా కస్టమర్లతో అనుసంధానిస్తున్న ఆపో్క

**విజయవాడ మేజర్ న్యూస్ :** సాంప్రదాయ బలాలను డిజిటల్ మౌలిక సదుపాయాలతో మిళితం చేయటం ద్వారా భారతదేశపు స్టార్టప్‌లు ఎలా స్థిరంగా అభివృద్ధి చెందవచ్చో అమెజాన్ విక్రేతలు ప్రదర్శిస్తున్నారు. ఈ ధోరణికి ఆపో్క, ఒక బలమైన ఉదాహరణ. భారతదేశ చేనేత నేత కార్మికులకు మద్దతు ఇచ్చే ఉద్దేశ్యంతో ఏర్పడిన ఆపో్క, అధీకృత, అధిక నాణ్యత గల చేనేత ఉత్పత్తులను అమెజాన్ ద్వారా నేరుగా వినియోగదారులకు అందించడానికి, చేతివృత్తులవారికి న్యాయమైన మార్కెట్ అవకాశాలు, స్థిరమైన జీవనోపాధిని అందించడానికి రూపొందించబడింది. ఆపో్క ప్రారంభమైన రోజుల్లో, సవాలు స్పష్టంగా ఉంది. అసాధారణమైన పనితనం ఉన్నప్పటికీ, చాలా మంది నైపుణ్యం కలిగిన నేత కార్మికులకు, మధ్యవర్తులపై ఆధారపడటం వలన దృశ్యమానత, ధర నిర్ణయ శక్తి, జాతీయ మార్కెట్లను చేరుకునే అవకాశం లేకపోయేది. ప్రామాణికతను కాపాడుతూనే, కస్టమర్లకు స్థిరమైన నాణ్యతను నిర్ధారించే, నేత సంఘాలకు మెరుగైన ఆర్థిక ఫలితాలను అందించే డైరెక్ట్-టు-కస్టమర్ మోడల్‌ను సృష్టించడం ద్వారా ఆపో్క ఈ అంతరాన్ని తగ్గించడానికి కృషి చేసింది. అమెజాన్ యొక్క డెలివరీ నెట్‌వర్క్, డిజిటల్ మౌలిక సదుపాయాలు మారుమూల ప్రాంతాలకు కూడా నమ్మకమైన షిప్పింగ్‌ను ప్రారంభించడం ద్వారా ఆపో్క విస్తరణ ప్రయాణానికి మద్దతు ఇచ్చాయి. రియల్-టైమ్ ఆర్డర్ ట్రాకింగ్, ఆటోమేటెడ్ చెల్లింపులు, పనితీరు విశ్లేషణలు బ్రాండ్ దాని స్వంత లాజిస్టిక్స్ లేదా టెక్నాలజీ వ్యవస్థలలో భారీ పెట్టుబడులు లేకుండా అభివృద్ధి చెందడానికి అనుమతించాయి. కార్యాచరణ అంశాలను క్రమబద్ధీకరించడంతో, ఆవిష్కరణ, ఉత్పత్తి అభివృద్ధికి, డిజైన్లను మెరుగుపరచడానికి, కలెక్షన్లను విస్తరించడానికి, నాణ్యత, స్థిరత్వాన్ని పెంపొందించడానికి నేత కార్మికులతో మరింత దగ్గరగా పనిచేయడానికి ఆపో్క ఎక్కువ సమయాన్ని కేటాయించగలిగింది.

## స్టెరాయిడ్ల వాడకంతో కంటి చూపుకు ముప్పు, సెకండరీ గ్లాకోమాకు దారితీసే ప్రమాదం



**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశం అంతటా స్టెరాయిడ్ల వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోతుండటం, తరచుగా వైద్యుల పర్యవేక్షణ లేకుండా వీటిని వాడుతుండటంపై వైద్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది 'సెకండరీ గ్లాకోమా' అనే ప్రమాదకరమైన కంటి సమస్యకు ప్రధాన కారణమవుతోందని, ఇది శాశ్వత అంధత్వానికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. అలర్జీలు, చర్మ వ్యాధులు, శ్వాసకోశ సమస్యల కోసం వాడే స్టెరాయిడ్లు, ప్రిస్క్రిప్షన్ లేకుండా దొరికే కంటి చుక్కల మందులు... దీర్ఘకాలం వాడితే కంటి ఒత్తిడిని గణనీయంగా పెంచుతాయి. దీనివల్ల కంటి నాడికి దీర్ఘకాలిక నష్టం వాటిల్లుతుందని చాలామంది రోగులకు తెలియకపోవడం గమనార్హం. అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా, 'డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్' దేశవ్యాప్తంగా డయాబెటిక్ రోగులకు ఉచిత గ్లాకోమా పరీక్షలను అందిస్తోంది. ఈ ఆఫర్ ఫిబ్రవరి 15, 2026 వరకు అందుబాటులో ఉంటుంది. అపాయింట్‌మెంట్ల కోసం 9594901868కు కాల్ చేయవచ్చు. గ్లాకోమాతో బాధపడుతున్న సుమారు 1.2 నుండి 1.3 కోట్ల మంది ప్రజలకు భారతదేశం నిలయంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్లాకోమా బాధితులలో ఇది దాదాపు ఆరవ వంతు. ప్రపంచవ్యాప్తంగా 7.5 నుండి 8 కోట్ల మంది గ్లాకోమాతో బాధపడుతుండగా, ఈ సంఖ్య 2040 నాటికి 11 కోట్లు దాటుతుందని అంచనా. ప్రపంచవ్యాప్తంగా శాశ్వత అంధత్వానికి గ్లాకోమా ప్రధాన కారణమైనప్పటికీ, భారతదేశంలో ఇది చాలా వరకు గుర్తించబడకుండా పోతోంది.



## ప్రైవేటు ఐటిఐ కళాశాలల నూతన కార్యవర్గం ఏర్పాటు

**పామర్రు మేజర్ న్యూస్ :** నియోజకవర్గ కేంద్రమైన పామర్రు లోని ఏవీఆర్ ఎం ఐటిఐ కళాశాలలో గురువారం కృష్ణాజిల్లా ప్రైవేటు ఐటిఐ కళాశాలల యాజమాన్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా యాజమాన్య సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సంఘం నూతన అధ్యక్షునిగా తాడిగడపకు చెందిన ఎ.శివ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా గుడ్లవల్లేరు కళాశాలకు చెందిన డి.భాస్కరరావు, కార్యదర్శిగా ఘంటసాలకు చెందిన పి.రవికుమార్, కోశాధికారిగా తేలప్రోలుకు చెందిన కె.శ్రీనివాసరావులతోపాటు రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఉయ్యూరుకు చెందిన ఎ.వైకుంఠరెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన పదవీ బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షులు, ఇతర కార్యవర్గ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ప్రైవేట్ ఐటిఐలు ఎదుర్కొంటున్న సమస్యలను టెక్నికల్ బోర్డు, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి అందరి సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. ఈ నూతన జిల్లా కమిటీ కార్యవర్గ పరిశీలకులుగా ఏవిఆర్ఎం ఐటిఐకరస్పాండెంట్ పూర్ణచంద్రారెడ్డి వ్యవహరించారు.

## ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవడంతో ప్రశాంత జీవనం



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవడం ద్వారా ప్రశాంత జీవనం సాగించవచ్చని తాడంకి గ్రామ మాజీ సర్పంచ్, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు జక్కా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని తాడంకి గ్రామంలో గౌడ రామాలయం సెంటర్ లో శరవేగంగా సాగుతున్న శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేసిన దాతలను సత్కరించి, రసీదులు అందజేశారు. రైతులందరూ సమిష్టిగా ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. ఆలయ నిర్మాణంలో దాతల భాగస్వామ్యం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీర్ రాపిరెడ్డి హరీష్, దాతలు, ఆలయ కమిటీ ప్రతినిధులు సంద్యాల వెంకటేశ్వరరావు, మారగాని సుబ్బారావు, జంపాన రఘుబాబు, సువర్ణగంటి నాగేశ్వరరావు, పరిసే శ్రీనివాసరావు, చలపాటి సుబ్బారావు, దాసరి శ్రీనివాసరావు, మారగాని ప్రసాద్, కాగిత శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## చెరకు సాగులో సమగ్ర పురుగుల యాజమాన్యంపై రైతులకు సూచనలు



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని యాకమూరు గ్రామంలో ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా చెరుకు పంటలో సమగ్ర పురుగుల యాజమాన్యం పై క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డా.డి.సుధారాణి మాట్లాడుతూ చెరుకులో కాండం తొలుచు పురుగు, పొలుసు పురుగు యాజమాన్యం గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. పొలుసు పురుగు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ లీటర్ నీటికి 0.25 మిల్లీ లీటర్లు చొప్పున కలుపుకుని పిచికారి చేసుకోవాలని, నల్లి పురుగు నివారణకు స్పైరోమెసిఫెన్ లీటర్ నీటికి ఒక మిల్లీ లీటరు చొప్పున కలుపుకుని పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సస్యరక్షణ శాస్త్రవేత్త డా. రేవతి, పలువురు రైతులు పాల్గొన్నారు.

# యనమదల వెంకయ్యరావు మృతి పార్టీకి తీరనిలోటు





**హనుమాన్ జంక్షన్, జనవరి 22, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం క్రమశిక్షణతో, అంకితభావంతో చివరి శ్వాస వరకు పని చేసిన యనమదల వెంకయ్యరావు మరణం పార్టీకి తీరని లోటని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామంలో గురువారం ఉదయం నిర్వహించిన యనమదల వెంకయ్యరావు సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వెంకయ్యరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ, పదవుల కోసం కాకుండా పార్టీ సిద్ధాంతాలు, ఆశయాల కోసం నిస్వార్థంగా పనిచేసిన నాయకుడు వెంకయ్యరావు అని కొనియాడారు. మల్లవల్లి గ్రామ అభివృద్ధిలో ఆయన చెరగని ముద్ర వేశారని, ప్రజలతో మమేకమై సేవ చేసిన ఆయన ఆకస్మిక మరణం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకయ్యరావు వంటి కార్యకర్తలు పార్టీకి ఎప్పటికీ గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సంస్మరణ సభలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బలవర్ధనరావు, దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, కాపా శ్రీనివాసరావు, నూతక్కి వేణు, ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, వేగిరెడ్డి పాపారావు, వీరమాచినేని సత్యప్రసాద్, ముల్పూరి సాయికళ్యాణి తదితర టీడీపీ నాయకులు పాల్గొని వెంకయ్యరావుకు నివాళులర్పించారు. గుండపనేని ఉమప్రసాద్, చింతల వెంకటశివ అప్పారావు, యనమదల రమేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే యార్లగడ్డ విస్తృత పర్యటన**

**కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ**

సంస్మరణ సభ అనంతరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బాపులపాడు మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఇటీవల మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మల్లవల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వేముల వేణు తల్లి వేముల రంగమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. అలాగే వీరవల్లి గ్రామ మాజీ సర్పంచ్ నందమూరి కృష్ణప్రసాద్



మాతృమూర్తి సీతాలక్ష్మి మరణించడంతో వారి నివాసానికి చేరుకుని నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. అదేవిధంగా రంగన్నగూడెం గ్రామానికి చెందిన యెనిగళ్ల శేఖర్ అమ్మమ్మ ఆలపాటి పుష్పావతి మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అదే గ్రామానికి చెందిన ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ సోదరుడు కోటేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆయన నివాసానికి వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కోటేశ్వరరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, మెరుగైన వైద్యం కోసం అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# విద్యార్థి ప్రయత్నమే తన విజయానికి రక్ష...



**గూడూరు, మేజర్ న్యూస్ :** కొత్త వస్తువులు విద్యార్థులకు ఉత్సాహాన్ని ఇస్తాయని ఉద్దేశంతో 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్స్ విద్యార్థి కిట్లను అందించామని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ పెడన శాఖ అధ్యక్షుడు పేరిశెట్టి నాగ రవి తెలిపారు. ఈ మేరకు గూడూరుమండలం, కప్పలదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ పెడన శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్యాడ్స్ విద్యార్థి కిట్లను అందించారు. ఈ సందర్భంగా నాగ రవి మాట్లాడుతూ తమ కుమార్తె పేరిశెట్టి నాగ శ్రీ తేజ పుట్టినరోజు సందర్భంగా కప్పలదొడ్డి హైస్కూలు లో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల సమయంలో ఉపయోగకరమైన ప్యాడ్స్, విద్యార్థి కిట్ లను 55 మంది విద్యార్థులకు ఉచితంగా అందించామన్నారు. పరీక్షల సమయంలో తీసుకోవలసిన మెళకువలను తెలియజేస్తూ ప్రతి విద్యార్థి తన ప్రయత్న లోపం లేకుండా చదివి విజయం సాధించాలని,మన ప్రయత్నమే మనకు రక్ష అని ఉద్బోధించి మంచి మార్కులతో విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై సుధారాణి, ఉపాధ్యాయులు బళ్ళ తీర్ధావతి, పేరక రవి,బూసం సత్యవంతుడు అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి,కట్టా నాగేశ్వరరావు, సైదా,రాయుడు రాజ్యలక్ష్మి,జి దుర్గ,గ్రామస్తులు బూసం సాయిబాబు,బళ్ళ నాగేశ్వరరావు, పదవతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం పాత చట్టాన్ని కొనసాగించాలి



**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** పేదల పొట్ట కొట్టే ఉపాధి హామీ పథకం కొత్త చట్టాన్ని రద్దుచేసి పాత చట్టాన్ని కొనసాగించాలని సిపిఎం మండల కార్యదర్శి పానెం ఆనందరావు అన్నారు. మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకాన్ని కాపాడాలని ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాల పంపిణీలో భాగంగా ఉపాధి కూలీల వద్దకు వెళ్లి కరపత్రాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పానం ఆనందరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం ఉపాధి కూలీల పొట్ట కొట్టి కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చే విధంగా ఉందన్నారు. పేదలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని అన్నారు. 2005లో వామపక్షాల పోరాటాల ఫలితంగా వచ్చిన ఈ చట్టం పేదలకు ఆర్థికంగా సులపాటు కల్పించి కూలీలకు పని గ్యారంటీ కల్పించింది అని అన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం వలన ఉపాధి కూలీలకు చట్టాన్ని స్కీమ్ గా మార్చి పని గ్యారంటీ లేకుండా చేసింది అలాగే బడ్జెట్లో కోత పెట్టి జాబు కార్డులు కుదిస్తూ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తున్నారు. వెంటనే కొత్త చట్టాన్ని రద్దుచేసి పాత చట్టాన్ని కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు టీ. లక్ష్మయ్య, ఉపాధి కూలీల ఎం.కృష్ణ, ఎన్ పున్నయ్య, కె రామస్వామి, పి కోటిలింగం,ఆర్ రమాదేవి,పి కుమారి,పి మోహన్ రావు పాల్గొన్నారు.

కొండపల్లి - విజయవాడ రైల్వే ట్రాక్ వెంబడి

# మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టండి..

**దక్షిణ మధ్య రైల్వే జీఎంను కలిసి విజ్ఞప్తి చేసిన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్**

**ఉపగ్రహ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ వినతి..**



**విజయవాడ మేజర్ న్యూస్ :** కొండపల్లి రైల్వే స్టేషన్ నుంచి విజయవాడలోని కృష్ణ మిల్క్ యూనియన్ వరకు రైల్వే ట్రాక్ వెంబడి మురుగునీరు, వర్షపు నీరు పేరుకుపోయే సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్ రైల్ నిలయంలో గురువారం ఎంపీ కేశినేని శివనాథ్, బిజెపి మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి నూతలపాటి బాల కోటేశ్వరరావు, ఇతర నాయకులు అధికారులతో రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కొండపల్లివిజయవాడ మధ్య కీలకమైన రైల్వే కారిడార్ వెంబడి శాస్త్రీయ డ్రైనేజీ వ్యవస్థ, క్రాస్ డ్రైనేజీ నిర్మాణాలు, ఛానెల్ కనెక్టివిటీ లేకపోవడం వల్ల వర్షాకాలంలోనే కాకుండా స్వల్ప వర్షపాతం సమయంలో కూడా నీరు నిలిచిపోతుందని తెలిపారు. దీని కారణంగా కొన్ని ప్రాంతాల్లో గట్టు కోతకు గురవడం, ట్రాక్ బలహీనపడటం, భద్రతా కారణాలతో రైళ్ల వేగం తగ్గించడం వల్ల కార్యాచరణ జాప్యాలు జరుగుతున్నాయని వివరించారు.

అంతేకాకుండా ట్రాక్‌కు సమీపంలోని నివాసితులు, పరిశ్రమలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాయని పేర్కొన్నారు. కొండపల్లి పారిశ్రామిక ప్రాంతం నుంచి సరుకు రవాణా అధికంగా ఉండటం, ఈ లైన్ వ్యూహాత్మకంగా ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉండటాన్ని దృష్టిలో ఉంచుకుని, సమగ్ర నీటి నిర్వహణ వ్యవస్థను ప్రాధాన్యతపై చేపట్టాలని ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి మొత్తం విస్తరణపై సాంకేతిక అంచనా నిర్వహించి, డ్రైనేజీ ఛానెల్‌లు, కల్వర్టులు, లింక్డ్ అవుట్‌ఫ్లో వ్యవస్థలతో కూడిన నెట్‌వర్క్‌ను రూపొందించి అమలు చేయాలని కోరారు. అవసరమైతే స్థానిక మున్సిపల్, నీటిపారుదల శాఖలతో సమన్వయం చేసుకుని తగిన బడ్జెట్ కేటాయింపులు చేయాలని సూచించారు. అలాగే విజయవాడ రైల్వే స్టేషన్‌పై పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు శాటిలైట్ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ ప్రస్తావించారు. బల్బ్ లైన్ల సమీప ప్రాంతాల్లో విస్తారమైన ఓపెన్ ల్యాండ్ అందుబాటులో ఉండటం, ప్రధాన రహదారులు, ఎయిర్‌వేస్‌లకు అనుసంధానం ఉండటం, భవిష్యత్తులో అమరావతి కొత్త రైల్వే లైన్‌కు దగ్గరగా ఉండటం వంటి అంశాలను వివరించారు. ఈ ప్రాంతంలో హాల్ట్ లేదా ఉపగ్రహ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తే అమరావతి, ఔటర్ రింగ్ రోడ్డ వంటి మౌలిక సదుపాయాలకు మెరుగైన కనెక్టివిటీ లభిస్తుందని, అలాగే విజయవాడ ప్రధాన రైల్వే స్టేషన్‌పై ప్రయాణికుల రద్దీ తగ్గుతుందని తెలిపారు. ఈ ప్రతిపాదనలపై డీపీఆర్‌తో పాటు సాధ్యాసాధ్యాల నివేదిక సిద్ధం చేసి, సంబంధిత విభాగాలతో సంయుక్త తనిఖీ చేపట్టి, ప్రజా సౌలభ్యం, లాజిస్టిక్స్ రవాణాను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరగా జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సి.ఎ.వో. ఆర్.ఎస్.పి సందీప్ కుమార్ జైన్, డి.జి.ఎమ్ ఉదయనాథ్ కోట్ల, సెక్రటరీ జి.ఎమ్. మల్లాది శ్రీనివాసరావు, వడ్లమూడి జగన్ మోహన్ రావు, జాలిపర్తి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## గోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన వైఎస్ఆర్సీపీ నాయకులు



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధి లోని ఐనపూరు గ్రామంలో తమ్ము గోపాలరెడ్డి భార్య ఇటీవల మరణించగా గురువారం జరిగిన పెద్దకర్మ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు పాల్గొని నివాళు లర్పించారు. పెనమలూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి, మండల పార్టీ అధ్యక్షులు యలమంచిలి గణేష్ బాబు, మండల వైస్ ఎంపీపీ, కృష్ణా జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, వైస్ ఎంపీపీ గంజాల సీతారామయ్య, కృష్ణా జిల్లా వాలంటరీ విభాగం జిల్లా అధ్యక్షులు పోలిమెట్ల వంశీకృష్ణ, మాజీ ఎంపీపీ శౌంఠి వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కొండ విజయలక్ష్మి- బసివిరెడ్డి దంపతులు, ఎంపిటిసి సభ్యులు వీర్ల ఆదిశేషు, గురువిందపల్లి వంశీ, పార్టీ నాయకులు అప్పిరెడ్డి శివారెడ్డి, కొఠంతం రాధా రమేష్, బొల్లా రాంబాబు, కొక్కిలిగడ్డ ఆనంద్, బంద్రపల్లి నాగరాజు, మట్టా మహేష్, శీలి రాము తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## విజయ క్రాంతి డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా విజయ క్రాంతి డిగ్రీ కాలేజ్ విద్యార్థులు చల్లపల్లి హైవే రోడ్లో బస్సు షెల్టర్ వద్ద స్వచ్ఛ సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముందుగా చల్లపల్లిలోని తరిగోపుల ప్రాంగణాన్ని, గాంధీ స్మృతి వనాన్ని,ఎన్టీఆర్ పార్కును, గంగుల వారి పాలెం రోడ్ లో గురువాబిరామం గార్డెన్స్ లను విద్యార్థులు సందర్శించి ఎంతో సంతోషించారు. ఈ విధంగా చల్లపల్లి ని స్వచ్ఛ సుందర చల్లపల్లిగా తీర్చిదిద్దుతున్న డాక్టర్ డి ఆర్ కె ప్రసాద్‌కి స్వచ్ఛ సుందర చల్లపల్లి సైనికులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యునిగా కృష్ణమోహన్



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యునిగా చల్లపల్లి ఆర్ ఐ ఘంటసాల కృష్ణ మోహన్ ఎన్నికయ్యారు. బుధవారం రాత్రి మచిలీపట్నంలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కృష్ణాజిల్లా కార్యవర్గ తొలి సమావేశం జరిగినది. చల్లపల్లి యూనిట్ నుండి రాష్ట్ర కమిటీ సభ్యునిగా కృష్ణ మోహన్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, కార్యదర్శి వేమవరపు సీతారామయ్య, కోశాధికారి శోభన్ బాబు, చల్లపల్లి యూనిట్ అధ్యక్షుడు మాధవేంద్ర రావు తదితరులు కృష్ణ మెహన్ ని సన్మానించి అభినందించారు.

## పురపాలక సంఘ అత్యవసర కౌన్సిల్ సమావేశం



**పెడన, మేజర్ న్యూస్:** పురపాలక సంఘ అత్యవసర కౌన్సిల్ సమావేశం చైర్పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ మేరకు ఈ కౌన్సిల్ సమావేశం ఎజెండాలో ఉన్న ఏడు అంశాలను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎజెండాలో ఉన్న ఏడు అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఏడవ అంశం ఒకటవ సచివాలయం వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ అధికారి రామకృష్ణ విధులు సరిగా నిర్వహించడం లేదని ఆ ప్రాంతంలో అధికంగా ఉన్న జనాభా అనేక వ్యాధులకు గురవుతున్నారని అతనిపై ఫిర్యాదులు అందడంతో మున్సిపల్ కమిషనర్ వివరణ కోరగా అధికారి సరైన సమాధానం చెప్పకపోవడంతో అతనిని ఆర్డీడి రాజమహేంద్రవరం వారికి సరెండర్ చేయుటకు కౌన్సిల్ ఆమోదం పొందేందుకు అంశాన్ని మున్సిపల్ కమిషనర్ చేర్చగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం పొందింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కార్యాలయ సిబ్బంది కౌన్సిల్ సభ్యులు తదితరులు ఉన్నారు.



## ఉచిత పశువైద్య శిబిరం

**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని అయ్యంకి గ్రామ శివారు కారకపాడు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 52 పశువులకు వివిధ రకాల వ్యాధులకు చికిత్స చేశారు. 22దూడలకు,100 గొర్రెలకు నట్టల నివారణ మందు వేసారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథి గా విచ్చేసిన గ్రామ సర్పంచ్ నాగనబోయిన సునీల్ కుమార్ పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ సత్యంద్ర మౌర్య మాట్లాడుతూ సీజనల్ వ్యాధులనుండి పశువులను కాపాడుకొనుటకు ఉచితముగా వేసే టీకాలు ప్రతి పశువుకి అందేలా చూడాలని లింగ నిర్ధారణ వీర్యము (పెయ్యి దూడలు మాత్రమే పుట్టేలా) అందుబాటులో వచ్చింది కావున రైతులు ఆ వీర్యాన్ని ఉపయోగించుకొని గేదలకు పెయ్యి దూడలు మాత్రమే కలిగేలా లాభపడాలని సూచించారు. పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసుకొనుట చేత పశువుల పునరుత్పత్తి సామర్థ్యము పూర్తి స్థాయిలో తీసుకువచ్చినట్లైతే తద్వారా పశువుల సంఖ్య పెరుగుతుందని రైతులకు సూచించారు. పశుభీమా అని పశువులకి తప్పనిసరిగా చేపించుకోవాలని తెలిపారు. ఈ శిబిరంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది రామ కృష్ణ, వెంకటయ్య, నరేంద్ర, కె. శ్రీనివాస్.తాతబ్బాయి తదితరులు పాల్గొని వైద్య సేవలు అందించారు.

## ఎఎఎన్ఎమ్ వివిఆర్ఎస్ఆర్ హైస్కూల్‌లో భగవద్గీత శ్లోకాల పోటీలు



**గుడ్లవల్లేరు జనవరి 22 మేజర్ న్యూస్ :** స్థానిక ఎ.ఎ.ఎన్.ఎమ్ వి.వి.ఆర్. ఎస్.ఆర్ గుడ్లవల్లేరు ఇం.మీ. హై స్కూల్ లో భగవద్గీత శ్లోకాల పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా విచ్చేసిన రిటైర్డ్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ద్రోణా వర్జుల ముక్తేశ్వర్ విద్యార్థుల్లో భారతం, భాగవతం, రామాయణం ఎంతో క్షుణ్ణంగా నేర్చుకుని మంచి జ్ఞానాన్ని సంపాదించాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు మెమొంటో, సర్టిఫికెట్ బహుకరించారు. అలాగే రిటైర్డ్ రైల్వే ఎంప్లాయ్ బాపట్ల నాగేశ్వరరావు, పద్మశ్రీ ఘంటసాల స్మారక సంగీత కళా పీఠ అధ్యక్షులు కాటూరి వెంకట మురళీకృష్ణ, అలాగే పాఠశాల ప్రిన్సిపల్ కుంజుమన్, డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, ఇతర ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేడు లోకేష్ జన్మదిన వేడుకలు



**పెడన,మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జన్మదిన సందర్భంగా పట్టణ టీడీపీ కార్యాలయంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ లోకేష్ జన్మదిన వేడుకలకు టీడీపీ కార్యకర్తలు నాయకులు తెలుగుదేశం పార్టీ అభిమానులు కూటమి ప్రభుత్వ నాయకులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## రేపు అవనిగడ్డలో విద్యుత్ అదాలత్

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ ఫోరం విజయవాడ వారి ఆధ్వర్యంలో శనివారం విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఉయ్యూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమా వెంకట సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బుచ్చి కోటయ్య భవనంలో శనివారం ఉదయం 10-30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో సిజిఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ ఎన్ విక్టర్ ఇమ్మానుయేలు ఫోరం సభ్యులు, సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ కృష్ణా సర్కిల్ మచిలీపట్నం, విద్యుత్ అధికారులు పాల్గొంటారని తెలిపారు.డివిజన్లోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను వ్రాతపూర్వకంగా సర్వీస్ కనెక్షన్ నెంబరు పూర్తి అడ్రస్ సెల్ నెంబర్తో సహా అర్జీ ఇచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయములు, హెచ్చుతగ్గులు, మీటరు సమస్యలు, బిల్లుల సమస్యలు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఇతర అన్ని సమస్యలను ఈ అదాలత్ ద్వారా పరిష్కరించుకోగలరని వారు కోరారు.

# ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలపై వైసీపీ దుష్ప్రచారం సరికాదు

## టీడీపీ నాయకుడు మాదిగాని గురునాథం



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు సంబంధించిన రాయితీ బకాయిలు, ప్రోత్సాహకాల విషయంలో వైసీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను టీడీపీ నాయకుడు మాదిగాని గురునాథం తీవ్రంగా ఖండించారు. విజయవాడ గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 202223 సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వ హయాంలోనే సుమారు రూ.800 కోట్ల బకాయిలు ఉన్నాయని, వాటిని ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వంపై మోపుతూ వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం 2024 – 25 సంవత్సరానికి సంబంధించి రూ.209.69 కోట్ల రాయితీలను మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో 6,675 మంది ఎస్సీ పారిశ్రామికవేత్తలు, 1,159 మంది ఎస్టీ పారిశ్రామికవేత్తలు లబ్ధి పొందారని చెప్పారు. అదేవిధంగా 202526 సంవత్సరానికి రూ.269.90 కోట్ల రాయితీలను మంజూరు చేయడంతో మొత్తం 11,125 మంది ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం చేకూరిందని వివరించారు. తాజాగా రూ.60.21 కోట్లను విడుదల చేయగా, ఇందులో 3,123 మంది ఎస్సీ, 423 మంది ఎస్టీ పారిశ్రామికవేత్తలు లబ్ధి పొందుతున్నారని స్పష్టం చేశారు. సబ్సిడీలు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ మంగళగిరిలో ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్లు నిరసన కార్యక్రమం చేపట్టిన నేపథ్యంలో, కొంతమంది వైసీపీ నాయకులు బ్లూ మీడియా ద్వారా కేవలం తెలుగుదేశం పార్టీ హయాంలోనే ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇవ్వడం లేదని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మాదిగాని గురునాథం విమర్శించారు. ఇదిలా ఉండగా, దావోస్‌లో ప్రపంచ దేశాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పాల్గొని దాదాపు రూ.6 లక్షల 65 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఎంఓయూలు కుదుర్చుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంపాదించిన ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే వైసీపీ ఈ తరహా అసత్య ప్రచారాలు చేస్తోందని ఆయన ఆరోపించారు.

## జాతీయ ప్రతిభా పురస్కారంకు ఎంపికైన స్వర్ణ వాహిని



**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కురుమద్దాలి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న దండే స్వర్ణవాహిని జాతీయ ప్రతిభా పురస్కారం 'అక్షర ప్రవీణ'కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆడిటోరియంలో శ్రీ శ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వర్ణవాహిని ఘనంగా సత్కరించారు. శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ సిఇఒ డా.కత్తి మండ ప్రతాప్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి డా.టి.పార్థ సారథి, జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరి భూషణం, శ్రీనాథుని వారసుల ఆధ్వర్యంలో స్వర్ణవాహిని సన్మాన, సత్కారాలు అందుకున్నారు.

## ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈవీఎం గోడౌన్ తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌను తనిఖీ చేసి గోడౌను కు ఉన్న సీలును,అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించి రిజిస్టర్ లో సంతకం చేశారు.అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ తనిఖీల్లో కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సిబ్బంది శ్యామ్ నాద్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు. వాయు కాలుష్యం ధ్వని కాలుష్యం నివారణకు పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ సైకిళ్ల ఎంతగానో తోడ్పడతాయి.

## జి కొండూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ సతీష్ కుమార్ ఆదేశాలతో జంగిల్ క్లియరెన్స్



**జి కొండూరు మేజర్ న్యూస్ :** విజయవాడ – విస్సన్నపేట రహదారిలోని వెల్లటూరు గ్రామంలో ప్రధాన మలుపుల వద్ద ఏపుగా, దట్టంగా పెరిగి ప్రమాదాలకు నిలయంగా ఉన్న ముళ్ళ చెట్లను యుద్ధ ప్రాతిపదికన గురువారం తొలగించారు. జి కొండూరు ఎస్సై కే.సతీష్ కుమార్ ఆదేశాల మేరకు గ్రామస్తులు, పెద్దలు కలసి స్థానిక గ్రామంలో ఉన్న ప్రధాన మలుపుల వద్ద ఉన్న చెట్లను తొలగించారు. దీంతో ఎదురు ఎదురుగా వచ్చే వివిధ రకాల వాహనాల రాకపోకలకు ఇబ్బంది తొలగిపోయింది. ఎన్నో ఏళ్లుగా దీర్ఘకాలికంగా ఉన్న ఈ జంగిల్ క్లియరెన్స్ సమస్య పరిష్కరించడానికి సహకరించిన ఎస్సైసతీష్ కుమార్ ను పలువురు అభినందించారు.

## అడుగూ అడుగునా ప్రమాదాలనూ నివారించడమే లక్ష్యంగా పనిచేస్తున్న పోలీస్ శాఖ



**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ, ఆర్ ఎస్సై లక్ష్మణ్, లా అండ్ ఆర్డర్ ఎస్సై భువనగిరి రాజూ వారి సిబ్బందితో కలిసి, ద్విచక్ర వాహనదారులకు పాదచారులకు హెల్మెట్ ధరించకపోతే జరిగే నష్టాలను గురించి వివరిస్తూ వాహనదారులతో మాటామంతి కలుపుతూ వారికి హెల్మెట్ ధరించకపోతే జరిగే ప్రమాదాల గురించి అవగాహన కార్యక్రమాలను ద్విచక్ర వాహనదారులను ఆపి కుటుంబ పెద్దను కోల్పోతే రక్తసంబంధీకులు కుటుంబీకులు ఏ విధంగా ఇబ్బందులకు గురవుతారు అనే విధంగా వాహనదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, సిబ్బంది, లా అండ్ ఆర్డర్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఇబ్రహీంపట్నంలో మందుబాబుల వీరంగం

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన దారుణం

### బార్‌లో యువకుడిపై దాడి చేసిన హైదరాబాద్ చెందిన యువకులు

**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** ఇబ్రహీంపట్నం మండలం తుమ్మలపాలెం గ్రామవాసి నాని పైన 16వ తేదీ రాత్రి ఇబ్రహీంపట్నంలోని ఒక బార్ లో హైదరాబాద్ కు చెందిన కొందరి యువకులు దారుణంగా దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి మంగళగిరి ఎయిమ్స్ హాస్పటల్లో చికిత్స పొందుతున్నాడు. యువకుడి పరిస్థితి క్లిష్టంగా ఉన్నట్టు తెలిసింది. తుమ్మపాలెం గ్రామానికి చెందిన యువకులకు హైదరాబాద్ చెందిన వ్యక్తులకు గొడవ జరుగుతుండగా యువకుడు మధ్యలో వెళ్లి ఆపే ప్రయత్నం చేశాడు. దీంతో రెచ్చిపోయిన హైదరాబాద్ వ్యక్తులు యువకుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు.

## ఆర్టీసీ కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు



**అవనిగడ్డ మేజర్ న్యూస్** ఏపీఎస్ఆర్టీసీ జాతీయ భద్రత మాసోత్సవాలలో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గురువారం స్థానిక డిపో కార్యాలయం వద్ద ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవనిగడ్డ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం లో భారతి దంతశాల వైద్యులు చేబ్రోలు హరిబాబు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు, వంగర శేషగిరిరావు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ వైద్య పరీక్షలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ కె. హనుమంతరావు, అసిస్టెంట్ మేనేజర్ సిహెచ్. శ్రీలక్ష్మి, సూపరింటెండెంట్ శ్రీధర్, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## సిరివెన్నెల విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఈనెల 25న అనకాపల్లిలో ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి కాంస్య విగ్రహ ఆవిష్కరణ కు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ను ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తానా సాహిత్య విభాగం, తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు అనకాపల్లి గాంధీ నగర్ లో విగ్రహావిష్కరణ సాయంత్రం నాలుగు గంటలకు పెంటకోట కన్వెన్షన్ సెంటర్లో సభా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఆహ్వానించినట్లు తెలిపారు.

## ఘనంగా ఎంపీపీ సుమతీదేవి జన్మదిన వేడుకలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ మండల పరిషత్ అధ్యక్షురాలు తుంగల సుమతి దేవి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం.మరియా దేవి, మండల పరిషత్ పాలకవర్గ సభ్యులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంపీపీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, కార్యాలయం సిబ్బంది ఎంపీపీకి కేక్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పూల బొకేలు ఇచ్చి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి. సాయిబాబు, వైస్ ఎంపీపీలు పులిగడ్డ. పిచ్చేశ్వరరావు, దిడ్ల కిరణ్, మండల పరిషత్ ఏవో రజిని, ఈవోపీఆర్డీలు డి. చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యులు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు రేపల్లె. శ్రీనివాసరావు, గ్రామ మాజీ ఉపసర్పంచ్, వైసిపి రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శి గాజుల. జయ గోపాల్, ఎంపీపీ భర్త తుంగల. అంకారావు తదితరులు పాల్గొన్నారు.

### పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ

ఎంపీపీ సుమతి దేవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అవనిగడ్డ పంచాయతీ పారిశుధ్య కార్మికులు 30 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వారికి భోజనం పొట్లాలు అందజేశారు.

## అగ్రిగోల్డ్ భూముల భౌతిక పరిశీలన



**విజయవాడ, జనవరి 22, మేజర్ న్యూస్ :** అగ్రిగోల్డ్‌కు సంబంధించి ప్రభుత్వం అటాచ్ చేసిన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సేకరించిన వివరాలతో నివేదికను రూపొందించడం జరుగుతోందని విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా గురువారం విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య.. జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు రెవెన్యూ, విజయవాడ నగరపాలక సంస్థ, సమాచార పౌర సంబంధాల శాఖ, సిఐడీ, ఈ–ఆక్షన్స్ తదితర విభాగాల అధికారులతో కూడిన జిల్లాస్థాయి కమిటీ విజయవాడలోని వివిధ ప్రాంతాలను సందర్శించింది. లోటల్ ల్యాండ్ మార్క్, పాయకాపురం, వాంబే కాలనీలోని మూడు సర్వే నంబర్లలోని భూములను కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో చైతన్య మాట్లాడుతూ అగ్రిగోల్డ్‌కు సంబంధించి ఏర్పాటైన జిల్లాస్థాయి కమిటీ సభ్యులు తాజాగా మూడు ఆస్తులను భౌతిక పరిశీలన చేయడం జరిగిందని.. ఈ తనిఖీల్లో సేకరించిన ఆస్తుల సమాచారం ఆధారంగా లిటిగేషన్ లేని భూముల వేలం ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు వీలుగా రీసర్వే, ప్రభుత్వ విలువ, మార్కెట్ విలువ, మ్యుటేషన్ తదితర వివరాలతో నివేదికలు పంపనున్నట్లు ఆర్‌డీవో చైతన్య తెలిపారు. క్షేత్రస్థాయి తనిఖీలో జిల్లా రిజిస్ట్రార్ పీవీవీ దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌కు బలమైన పునాదులు వేస్తున్న మంత్రి నారా లోకేష్

**జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)**



**విజయవాడ మేజర్ న్యూస్ :** యువ నాయకత్వానికి ప్రతీకగా నిలుస్తూ, ప్రజాసేవను ధ్యేయంగా చేసుకుని ముందుకు సాగుతున్న మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు సాగుతున్న నాయకత్వం నారా లోకేష్‌దని ఎంపీ కేశినేని శివనాథ్ కొనియాడారు. పరిపాలనలో ఆధునిక దృక్పథం, యువత ఆశయాలకు అనుగుణమైన ఆలోచన విధానం, ప్రజలకు చేరువయ్యే రాజకీయ శైలి ఆయనను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయని పేర్కొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ జూనియర్ కళాశాలను తీర్చిదిద్దటంలో విద్య,ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ ఎనలేని కృషి చేస్తున్నారు. విద్యా శాఖ మంత్రిగా నారాలోకేష్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రగతికి రథసారథిగా అభివృద్ధిని పరుగులు పెట్టించడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. రాజకీయ నీతిజ్ఞుడు, అపర చాణుక్యుడు. సీఎం చంద్రబాబు నాయుడు తనయుడిగా కాకుండా తనదైన శైలిలో దూసుకువెళుతున్నారంటూ కొనియాడారు. గెలుపు సాధించే విషయంలో ఎంతో పట్టుదలగా కృషి చేసి అందుకోవటం ద్వారా యువతకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. యువతను రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములుగా తీర్చిదిద్దే దిశగా ఆయన చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయమని, భవిష్యత్తు ఆంధ్రప్రదేశ్‌కు బలమైన పునాదులు వేస్తున్న నాయకుడిగా నారా లోకేష్ ఎదుగుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నారా లోకేష్‌కు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని, ప్రజాసేవలో మరిన్ని మైలురాళ్లు అధిగమించాలని, రాష్ట్రాభివృద్ధికి మరింత బలమైన నాయకత్వాన్ని అందించాలని కోరుకుంటూ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఉత్తమమైన స్థానం నిలుపుకోవాలి



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** స్వచ్ఛ సర్వేక్షన్ లో ఉత్తమమైన స్థానం నిలుపుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు అన్నారు. గురువారం ఉదయం ప్రధాన కార్యాలయంలో ని నూతన భవనంలోని మీటింగ్ ప్రజా ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2024- 25 లో విజయవాడకు సూపర్ స్వచ్ లీగ్ సిటీ పురస్కారం అందుకోవటం గర్వకారణం అని దానికి ముఖ్య కారణం సిబ్బంది చేసిన శ్రమ అని అభినందించారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2025-26 లో కూడా విజయవాడ ను ఉత్తమమైన స్థానం మనం నిలుపుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన టూల్ కిట్ ని వివరించారు. దాని కనుగుణంగా పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, విజయవాడను ఉత్తమమైన స్థానంలో నిలిపేందుకు నిరంతర కృషి అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ గోపాల నాయక్, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

# వైద్య విద్య పరీక్షల తీరుపై మరింత నిఘా





(మొదటిపేజీ తరువాయి)

సీసీ కెమెరాల ద్వారా విశ్వవిద్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూము నుంచి పర్యవేక్షిస్తుంటారని తెలిపారు దీనివల్ల కాపీయింగ్ వంటి ఘటనలకు అవకాశం ఉండదని తెలిపారు. గతానుభవాల దృష్ట్యా వైద్య విద్య పరీక్షల్లో కాపీయింగ్ నిరోధానికి ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లోని పరీక్షలు జరిగే గదుల్లో ఉండే సీసీ కెమెరాలకు విశ్వవిద్యాలయంలోని రిమోట్ కమాండ్ కంట్రోలు రూముకు అనుసంధానం చేసినట్లు మంత్రి తెలిపారు. విశ్వవిద్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమును మంత్రి సత్యకుమార్ గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ అన్ని కోర్సుల్లో కలిపి వార్షిక, సప్లిమెంటరీ పరీక్షల కింద ఏడాదికి సుమారు 60వేల మంది పరీక్షలు రాస్తుంటారని తెలిపారు. ఎంబీబీఎస్, పీజీ పరీక్షల నుంచి దశల వారీగా డెంటల్ ఆయుర్వేద, హోమియో, నర్సింగ్ ఇతర కోర్సుల్లో చదివే విద్యార్థులకు నిర్వహించే పరీక్షలను సైతం రిమోట్ కమాండ్ కంట్రోల్ రూము ద్వారా పర్యవేక్షిస్తామని వివరించారు. ప్రస్తుతానికి 5 వైద్య కళాశాలల్లో ప్రస్తుతం జరిగే పరీక్షల తీరును గమనించడం ప్రారంభించినట్లు తెలిపారు. కాలేజీల సంఖ్య క్రమంగా పెరుగుతుందన్నారు. ఈ రిమోట్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రస్తుతం ఉన్న విధానానికి అదనంగా ఉంటుందన్నారు. ఈ సెంటర్ ఏర్పాటుతో పరీక్షల నిర్వహణలో పాల్గొనే వారు మరిశీత అప్రమత్తం అవుతారని తెలిపారు. మానవ వనరులు వృధా కాకుండా ఉంటాయని చెప్పారు.

**70రోజుల వరకు నిక్షిప్తం !**

కళాశాలలోని గదుల్లో పరీక్షలు రాసే విద్యార్థుల కదలికలు కమాండ్ కంట్రోల్ రూములోని కంప్యూటర్లలో నిక్షిప్తమవుతాయి ఇక్కడ జరిగే రికార్డింగ్ (దృశ్యాలు) 70 రోజుల వరకు అందుబాటులో ఉంటుంది రికార్డింగ్లోని దృశ్యాలు చెడిపోని విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. కళాశాలల్లోని గదుల సామర్థ్యాన్ని అనుసరించి సీసీ కెమెరాలను ఉపయోగిస్తున్నారు. ప్రతి వైద్య కళాశాలలో సగటున 25 సీసీ కెమెరాలు ఉంటాయి. కమాండ్ కంట్రోల్ రూములో మొత్తం ఆరు స్క్రీన్ల వీడియో వాల్ తోపాటు పది కంప్యూటర్లు ఉన్నాయి. వీటిని ఉద్యోగులు నిశితంగా పరిశీలన చేస్తుంటారు. కళాశాలల్లో సీసీ కెమెరాలు పనిచేయకుండా ఉన్నా... వెంటనే కమాండ్ కంట్రోల్ రూములోనికి వారికి ఏఐ ద్వారా తెలిసేలా చర్యలు తీసుకున్నారు. ఉద్యోగులకు ర్యాండమ్ విధానంలో విధులను కేటాయిస్తారు. ఒకవేళ కళాశాలలో ఇంటర్నెటు కనెక్షన్ పనిచేయని సమయంలో జరిగిన దృశ్యాలు సైతం కనిపించేలా చర్యలు తీసుకున్నారు. పరీక్షలు ముగిసిన అనంతరం ప్రస్తుత విధానంలో మాదిరిగా కళాశాలల యాజమాన్యాలు సీసీ కెమెరాల వినియోగ హార్డ్ డిస్కును విశ్వవిద్యాలయానికి పంపించాల్సిన అవసరం ఉండదు.



**అన్ని పరీక్షలను రిమోట్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరిశీలించేలా చర్యలు**

ఓరిగో బిజ్ సొల్యూషన్స్ సిస్టమ్ ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్ కార్యకలాపాలు కొనసాగుతాయి. దూరాంక్ సంస్థ వారు సాఫ్ట్వేర్ అందించారు. "కేంద్రం ఏర్పాటుకు రూ. 30 లక్షల వరకు ఖర్చు అయింది. రెండేళ్ల నిర్వహణ కింద రూ. 1.5కోట్ల వరకు ఖర్చు అవుతుంది విశ్వవిద్యాలయం ద్వారా జరిగే ఇతర పరీక్షలను కూడా రిమోటు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరిశీలించే విధంగా చర్యలు తీసుకుంటాం' అని విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డి వివరించారు. విలేకరుల సమావేశంలో యూనివర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ శ్రీకాంత్ ఏపీ వైద్య మండలి చైర్మన్ శ్రీహరిరావు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పనులు పరిశీలన









**నందిగామ జనవరి 22, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం నందిగామ మండలం, కంచెల గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పంట కాలువ పూడికతీత పనిని పరిశీలించారు. పని రూ.66,690 /- అంచనా వ్యయంతో 1200 మీ. పొడవు ఉన్న పంట కాలువ పూడిక తీత పని ఎంత జరిగింది, ఉపాధి శ్రామికులకు ఎంత వేతనం వస్తుందో అడిగి తెలుసుకొని కచ్చితంగా 307/- రూపాయలు పొందేలా అందరూ కూడా నిర్దిష్ట కొలతలతో పనిచేయాలని ఉపాధి శ్రామికులతో మాట్లాడటం జరిగింది. కొత్త కంచెల గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పల్లె పండుగ 2.0లో ఒక్కో షెడ్ 2.00 లక్షల అంచనాల వ్యయంతో నిర్మించిన రెండు పశువుల షెడ్లు పరిశీలించి లబ్ధిదారుల వద్ద నుండి షెడ్ల యొక్క ఉపయోగాలు తెలియజేశారు. అలాగే కంచెలలో పల్లెపండుగ 1.0లో 20 లక్షల అంచనాల వ్యయంతో పూర్తిచేసిన సీసీ రోడ్డును పరిశీలించి ఇలాంటి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లు వెంటనే పేమెంట్ చేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే పల్లె పండుగ 2.0లో కొత్తగా మంజూరు అయిన రోడ్లు అన్ని కూడా వెంటనే పూర్తిచేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

# ఈ నెల 23 నుంచి షిర్డీలో ఉద్యోగుల జాతీయ మహాసభలు




**మహాసభలకు తరలివెళ్లిన ఏపీ ఎన్‌జీజీవో ప్రతినిధులు**

**ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై సమాఖ్య మహాసభల్లో చర్చిస్తాం**

**ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేస్తాం**

**ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్**

**విజయవాడ, జనవరి 22, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు మహారాష్ట్రలోని షిర్డీలో జరగనున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య 18వ జాతీయ మహాసభల్లో చర్చించి తీర్మానాలు రూపొందించి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించేలా చర్యలు తీసుకుంటామని సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు, ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ తెలిపారు. షిర్డీలో ఈ నెల 23వ తేదీ నుంచి జరగనున్న అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ మహాసభల్లో పాల్గొనేందుకు ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.విద్యాసాగర్, డీవీ రమణల నేతృత్వంలో దాదాపు 100 మంది ఉద్యోగ సంఘాల నేతల బృందం గురువారం విజయవాడ నుంచి షిర్డీకి రైలు మార్గంలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద మీడియా ప్రతినిధులతో విద్యాసాగర్ మాట్లాడుతూ అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు సుభాష్ లాంబా, ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ నేతృత్వంలో షిర్డీలో 18వ జాతీయ మహా సభలు జరగనున్నాయన్నారు. మహాసభల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన దాదాపు 1200 మందికి పైగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరవుతారని.. దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా ఆత్మీయ అతిథులుగా వివిధ సమాఖ్యలకు సంబంధించిన ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. మన రాష్ట్రం నుంచి వివిధ జిల్లాలకు చెందిన వంద మంది ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సదస్సుకు తరలివెళ్తున్నారన్నారు. సమావేశంలో పాల్గొనే ప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజులు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి వివిధ సమస్యలను ప్రస్తుల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు సానుకూల దృక్పథంతో ఉందన్నారు. మహాసభల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సిపిఎస్ అంశం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వివిధ రాష్ట్రాలలో ఉన్న వేతన సవరణ సమస్యలు, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్ల మీద చర్చ, అంతర్జాతీయంగా జరుగుతున్న వివిధ పరిణామాలపై సమావేశాల్లో చర్చించి, పలు తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా అఖిలభారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గానికి కూడా ఈ నెల 26వ తేదీన ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికల్లో జాతీయ ఉపాధ్యక్షుడిగా తిరిగి పోటీచేస్తున్నట్లు ఏపీ ఎన్‌జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ తెలిపారు. సమాఖ్య జాతీయ సదస్సులో పాల్గొనేందుకు షిర్డీకి తరలివెళ్లినవారిలో ఎ.విద్యాసాగర్, రమణలతో పాటు రాష్ట్ర సంఘ ప్రతినిధులు భారతీ ప్రసాద్, కె.జగదీశ్వరరావు, సుబ్బారెడ్డి, రంజిత్ నాయుడు, మహిళా ప్రతినిధులు జానకి, రాజ్యలక్ష్మి, శాంతిశ్రీ, సరస్వతి, సురేఖ, శివలీల, విజయశ్రీ, లలితాంబ, క్యాపిటల్ సిటీ అధ్యక్షుడు నాగభూషణం, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, విజయవాడ నగరశాఖ ప్రతినిధులు ఉన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

**మొవ్వ మేజర్ న్యూస్:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని, జి రాంజీ బిల్లును వెనక్కి తీసుకోవాలని కోరుతూ సిపిఎం పార్టీ కృష్ణాజిల్లా కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు మొవ్వ మండలం మంత్రిపాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల ప్రదేశంలో గురువారం ఉదయం కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శీలం. నారాయణరావు, ఉపాధి కార్మికులు కే.శివ, జే చిన్నారి, పి. నాగలక్ష్మి, జే. కనకదుర్గ, ఎస్తేరు రాణి, చంద్రిక, అంజలి, పౌలు, సీతామహాలక్ష్మి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.



# మ్యాజిక్ వీవ్స్.. మహిళా సాధికారతకు వేవ్స్

**జిల్లాలోనూ మ్యాజిక్ వీవ్స్‌కు శ్రీకారంచుడదాం : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**







**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జనవరి 22, మేజర్ న్యూస్ :** మ్యాజిక్ వీవ్స్ కార్యక్రమం ఔత్సాహిక స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడుతుందని.. ఒక కుటుంబం–ఒక పారిశ్రామికవేత్త లక్ష్యాల సాధనలో మరో అడుగు ముందుకేస్తూ ఆశల తరంగాల్లా ఈ వినూత్న కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభిస్తామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఆప్కో ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఎర్రబాలెంలో అమలవుతున్న మ్యాజిక్ వీవ్స్ కార్యక్రమాన్ని కలెక్టర్ లక్ష్మీశ గురువారం పరిశీలించారు. హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ కమిషనర్ జి.రేఖారాణితో మాట్లాడి కార్యక్రమ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ హితంగా సంప్రదాయ చేనేత కళకు ఆధునిక డిజైన్లను జోడించి.. విలువైన ఉత్పత్తులను రూపొందించడం, తద్వారా అనాథలు, బలహీన వర్గాల వారికి చేయూతనివ్వడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ప్రస్తుతం 30 మంది అనాథ పిల్లలకు వస్త్రాన్ని గ్రేడింగ్ చేసి బ్యాగులు, పౌచ్‌లు, దుస్తులు, ఫైల్ కవర్లు, ఔషధ కిట్లు వంటి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చేందుకు అవసరమైన శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ కాలుష్యానికి అడ్డుకట్ట వేస్తూ చిన్న వయసు నుంచే సృజనాత్మకత, పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని రేఖారాణి వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విలువ జోడింపుతో ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయని.. ఆప్కో ద్వారా వస్త్రాలు, యంత్రాలు, మౌలిక సదుపాయాలు, శిక్షణ, మార్కెట్ లింకేజీ సౌకర్యాల సహకారంతో కార్యక్రమాన్ని జిల్లాలోనూ అమలుచేస్తామని తెలిపారు. ఈ మ్యాజిక్ వీవ్స్ కార్యక్రమం చేనేత వారసత్వ సంపద పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, ఉపాధి సృష్టి, సామాజిక భాగస్వామ్యంతో సుస్థిర అభివృద్ధికి దోహదపడుతుందని.. స్వర్ణాంధ్ర సాధన దిశగా చేస్తున్న ప్రయాణంలో మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

## విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి



**పెడన, మేజర్ న్యూస్ :** జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని తల్లి దండ్రులు ఉపా ధ్యాయుల మార్గదర్శకత్వంలో ఈ దశలో ముందుకు వెళ్లాలని డైట్ అధ్యాపకులు మద్ది బాబూ రాజేంద్రప్రసాద్ పేర్కొ న్నారు. 75 రోజుల జి ఎఫ్ ఎల్ ఎన్, 100 రోజుల పదవ తరగతి ప్రణాళిక అమలును పరిశీలించడానికి గురువారం గూడూరు మండలంలోని కంకటావ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, కంకటావ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థు లు సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత విజయాలు సాధించాలని తెలియజేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీ లించారు. మూల్యాంకనపత్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనేక పోషకాలతో అందించబడుతున్న మధ్యాహ్న భోజన పథకం విద్యార్థు లకు ఎంతో ఉపయోగకరమని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యా ప్రమాణాలు పెంపొందింప చేయటం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వీ. రోహిణి, కె. పోతురాజు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పచ్చని గన్నవరం నిర్మాణానికి సంకల్పం

**ముస్తాబాదలో వృక్షారోపణకు శ్రీకారం..**



**గన్నవరం, జనవరి 22, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలం ముస్తాబాద గ్రామంలో ఎల్‌అండ్‌టీ సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావిస్తూ విస్తృత వృక్షారోపణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి గన్నవరం మండల తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య ముఖ్య అతిథిగా హాజరై మొదటి మొక్కను ముస్తాబాద గ్రామంలో నాటారు. రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో సుమారు 5000 మొక్కలు నాటించి వాటిని సంరక్షించే బాధ్యతను ఎల్‌అండ్‌టీ సంస్థ స్వీకరించిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ఈ కార్యక్రమం ద్వారా గ్రీన్ గన్నవరం లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ముత్తు కుమార్, గన్నవరం తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, వీఆర్ఓ నళినీ కుమార్, కంపెనీ మేనేజర్లు హరి ప్రసాద్, భాస్కర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ పరిపాలన అధికారిగా సురేష్



**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిషత్ పరిపాలన అధికారి (ఏ.ఓ) గా పమిడిముక్కల మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న వేముల. సురేష్ కుమార్ బదిలీ అయ్యారు. మచిలీపట్నంలో బుధవారం జరిగిన పదోన్నతి బదిలీలపై సురేష్ కుమార్‌ను జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణాధికారి కన్నమనాయుడు, ఉపముఖ్య కార్యనిర్వహణాధికారి ఆనంద్ కుమార్, జిల్లా పరిషత్ పరిపాలనాధికారితేజస్విల ఆధ్వర్యంలో నియమించారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999